

మాట్లాడుతున్న కలెక్టర్ రంజిత్ బాషా

పెను విషాదానికి 18 ఏళ్లు



- 2007లో మరబోటు మునిగి 61 మంది జలసమాధి
- సింగోటం బ్రహ్మోత్సవాలకు వెళ్తుండగా ఘటన
- ఈ ఏడాదీ తప్పని బోటు ప్రయాణం

కృష్ణానదిలో మరబోటు మునిగిపోయి 61 మంది జలసమాధి అయిన సంఘటన జరిగి 18 ఏళ్లు నిండాయి. నాగర్ కర్నూల్ జిల్లా సింగోటం లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన భక్తులు కృష్ణానది మీదుగా మరబోటులో వెళ్తుండగా జరిగిన ఈ దుర్ఘటన దేశ వ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది..

ప్రజాశక్తి-పగిడ్యాల/కొత్తపల్లి

ప్రతి సంవత్సరం జనవరి రెండవ వారంలో తెలంగాణ రాష్ట్రం నాగర్ కర్నూలు జిల్లా సింగోటం బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తారు. ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా రాయలసీమ, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వెళ్తారు. అలాగే 2007, జనవరి 18వ తేదీన బ్రహ్మోత్సవాల్లో ప్రధానఘట్టమైన రథోత్సవాన్ని తిలకించేందుకు ప్రస్తుత నంద్యాల జిల్లా పగిడాల మండలం నెహ్రూ నగర్‌కు చెందిన భక్తులు మరబోటులో బయలు దేరారు. తెలంగాణ ప్రాంతంలోని మంచాలకట్ట గ్రామానికి చేరువలో బోటు అదుపుతప్పి కృష్ణానదిలో మునిగి పోయింది. ప్రమాదంలో 61 మంది జలసమాధి అయ్యారు. బోటులో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించుకోవడం వల్ల జరిగిన ఈ ప్రమాదం భక్తుల కుటుంబాల్లో విషాదం నింపింది. అప్పట్లో ఈ సంఘటన దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

● అమలు కాని హామీ

ప్రమాదం జరిగిన మరుసటి రోజు 19వ తేదీన ఉదయం 11 గంటలకు హెలికాప్టర్ ద్వారా అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మంచాలకట్ట గ్రామానికి చేరుకొని ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. నదిలో గాలించి మృతదేహాలను వెలికి తీసి బాధిత కుటుంబాలకు అప్పజెప్పాలని రెవెన్యూ, పోలీస్ అధికారుల ను ఆదేశించారు. ఇరు ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ప్రకటించారు. సోమశిల - సిద్ధేశ్వరం వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అప్పటి మహబూబ్‌నగర్ కలెక్టర్ సుధారాణి ఆధ్వర్యంలో పోలీస్, రెవెన్యూ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ఇతర శాఖల సమన్వయంతో మృతదేహాల కోసం 10 రోజుల పాటు గాలించారు. సంఘటనా స్థలంలోనే క్యాంపులు వేసుకొని పర్యవేక్షించారు. చివరకు ప్రమాదం జరిగిన ప్రదేశానికి అర కిలోమీటరు దూరంలో మృతదేహాలు లభ్యం అయ్యాయి. మరో మూడు మృతదేహాలను జటప్రోల్ వైపు గుర్తించి బాధిత కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆ తర్వాత 2009 అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఫిబ్రవరి 13వ తేదీన వైఎస్ రాజశేఖర్ రెడ్డి కొల్లాపూర్ పర్యటనకు వచ్చారు. స్థానిక ఎమ్మెల్యే జూపల్లి కృష్ణారావుతో కలిసి వంతెన నిర్మాణానికి సంబంధించిన పైలాన్ ఆవిష్కరించారు. కానీ ఇప్పటివరకు ఆ హామీ అమలు కాలేదు. ప్రస్తుతం సింగోటం బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. రాయ లసీమ, కడప, కర్నూల్, నంద్యాల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు. వారికి మర బోటులో ప్రయాణం తప్పని సరిగా మారింది.

● రక్షణ చర్యలు అవసరం...

రాయలసీమ ప్రాంతం నుంచి బ్రహ్మోత్సవాలకు మరబోటులో వెళ్లే భక్తుల రక్షణ కోసం రెవెన్యూ, పోలీసు అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది. కృష్ణానది తీర గ్రామాలు, ప్రాంతాల్లో మరబోటు యజమానులను అప్రమత్తం చేయాల్సి ఉంది. బోటులో ప్రయాణించే వారందరూ లైఫ్ జాకెట్లు ధరించేలా చూడాల్సి ఉంది. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం ప్రతీ సంవత్సరం జనవరి 18న జరిగేది. కానీ ఈ ఏడాది 17వ తేదీనే నిర్వహించారు.

కృష్ణా నదిపై బోటు ప్రయాణం నిషేధం

ప్రజాశక్తి - పగిడ్యాల

తెలంగాణ రాష్ట్రం సింగోటం జాతర శ్రీశైలం బ్యాక్ వాటర్ కృష్ణా నదిపై బోటు ప్రయాణం నిషేధించినట్లు తహశీల్దార్ శివ రాముడు, నందికొట్కూరు రూరల్ సిఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం మండలంలోని నెహ్రూనగర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మూర్వకొండ ఘాట్‌ను తహశీల్దార్ శివ రాముడు, సిఐ సుబ్రహ్మణ్యం పరిశీలించి మాట్లాడారు. నంద్యాల కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, డీఎస్పీ రామాంజి నాయక్ ఆదేశాల మేరకు కృష్ణా నదిపై బోటు ప్రయాణం నిషేధించినట్లు తెలిపారు. సింగోటం జాతరకు వెళ్లే ప్రజలు, భక్తులు బస్సులో ప్రయాణించాలని సూచించారు. గతంలో బోటు ప్రయాణం చేస్తుండగా ప్రమాదం జరగడంతో అలాంటి ప్రమాదాలు జరగకుండా కృష్ణా నదిపై బోటు ప్రయాణాన్ని నిషేధించినట్లు తెలిపారు. అనుమతి లేకుండా బోటు ప్రయాణాలు నిర్వహిస్తే కఠిన చర్య తీసుకుంటామని వారు హెచ్చరించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన వారిలో ఆర్ఐ రంగారెడ్డి, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



మూర్వకొండ ఘాట్‌ను పరిశీలిస్తున్న తహశీల్దార్, సిఐ

ఉపాధి కల్పనలో అలసత్వం వీడాలి

- మూడో శనివారం -స్వచ్ఛ దివస్ - జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛాంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమాలను చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించిందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాష పేర్కొన్నారు. ఉపాధి హామీ పనుల కల్పనలో అలసత్వం వీడాలని అధికారులను హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్ నుండి స్పెషల్ ఆఫీసర్లు, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో బహిరంగ ప్రదేశాలయిన బస్టాప్‌లు, మార్కెట్ యార్డ్‌లు, చెత్తఎక్కువగా ఉన్న ప్రదేశాలు, డ్రెయిన్స్ ను శుభ్రం చేయడం, పబ్లిక్ టాయిలెట్స్‌ను శానిటైజ్ చేయడం, పిచ్చి మొక్కలను తీసి వేయడం వంటి శుభ్రపరిచే కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించారు. మున్సిపాలిటీ, పంచాయతీల్లో ఉన్న పెద్ద చెత్త కుప్పలను తొలగించి వాటిని చెత్త సంపద తయారీ కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకోవాలని ఇఒపిఆర్‌డి ఎంపిడిఓలు, పంచాయతీ సెక్రటరీలను ఆదేశించారు. పరిశుభ్రత పై ప్రజలకు అవగాహన కల్పించే విధంగా ర్యాలీలు నిర్వహించాలని ఆదేశించారు. ఫిబ్రవరి మాసంలో 'సోర్స్ - రిసోర్స్' అనే థీమ్‌తో స్వచ్ఛ దివస్ కార్యక్రమాలు నిర్వహిస్తు న్నారు. మంత్రాలయం, గూడూరు, గోనెగండ్ల, కోసిగి మండలాలలో కూలీలు వలసలకు వెళ్తున్నా రనే వ్యతిరేక కథనాలు పత్రికల్లో వస్తున్నాయన్నారు. గ్రామాలను సందర్శించారా? పనులు కల్పిస్తున్నప్పటికీ కూలీలు వలసలకు వెళ్తున్నారా? పనులు కల్పించకపోవడం వల్ల వారు వలసలకు వెళుతున్నారా? సంబంధింత గ్రామాల్లో ఎన్ని సెల్ఫ్ ఆఫ్ వర్క్‌లను కేటాయించారు? అన్న వివరాలను కలెక్టర్ ఎంపిడిఒలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలను సందర్శించి, వలసలను వెళ్లవద్దని, ఉపాధి పనులను కల్పిస్తామని భరోసా కల్పించాలని, గ్రామాల్లో ఈ విధమైన అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో పనులు కల్పించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న గోకులాలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్‌కు సంబంధించి అంగన్వాడీ కేంద్రాల్లో పెండింగ్‌లో ఉన్న టాయిలెట్ నిర్మాణాలు, తాగు నీటి వసతుల కల్పన పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా యాస్పిరేషనల్ బ్లాక్‌లలో పెండింగ్‌లో ఉన్న పనులను ముందుగా పూర్తి చేయాలని ఆదేశించారు. రానున్న వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ఉండేందుకు వీలుగా సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించాలని ఆదేశించారు. పిజిఆర్ఎస్‌కి సంబంధించి రీ సర్వే జరిగిన గ్రామసభలో వచ్చిన అర్జీలలో కేవలం 60 శాతం అర్జీలు మాత్రమే పరిష్కరమయ్యాయని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. మంత్రాలయం, హొళగుంద, కర్నూలు రూరల్ , ఓర్వకల్లు, వెల్దుర్తి, ఆస్పరి,దేవనకొండ, హాళహర్వి , నందవరం, ఎమ్మిగనూరు, సి.బెళగల్ మండలాల్లో కూడా పెండింగ్‌లో ఉన్నాయని వాటిని కూడా త్వరితగతిన పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంబంధిత మండల తహసీల్దారులను ఆదేశించారు. ఎంఎస్ఎంఇ సర్వే ప్రారంభించి నెల రోజులైనప్పటికీ పురోగతిలో చాలా వెనుకబడి ఉన్నామని, పురోగతి సాధించే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారుల ను ఆదేశించారు. క్యాస్ట్ సర్వేకు సంబంధించి షెడ్యూల్ ప్రకారం జనవరి 20లోపు వచ్చిన అర్జీలను పరిష్కరించి సచివాలయాలలో లిస్ట్ పబ్లిష్ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. గోనెగండ్ల, కర్నూలుఅర్బన్, ఆదోని, తుగ్గలి, పత్తికొండ, ఆస్పరిలో పెండింగ్ ఉన్నాయని, వీటిని ఆన్లైన్‌లో నమోదుచేసి, త్వరితగతిన పరిష్కరించి, లిస్ట్‌పబ్లిష్ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య, అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఘోర రోడ్డు ప్రమాదం

- ముగ్గురు మృతి

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

కోడుమూరు మండలం ప్యాలకుర్తి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతిచెందారు. ఈ రోడ్డు ప్రమాదంలో కోడుమూరు కు చెందిన 18వ వార్డ్ మెంబర్ సోమశేఖరు(45), బండ శ్రీనివాసులు(45), రాజోలి శ్రీనివాసులు (42) మృతి చెందారు. వారు ముగ్గురూ చీరల వ్యాపారులు. స్థానికులు, పోలీసుల వివరాల ప్రకారం... వారు ముగ్గురు కర్నూలులో పట్టు చీరల వ్యాపారం ముగించుకుని కారులో తిరిగి కోడుమూరు కు వస్తుండగా ఐచర్ వాహనం టైర్ పేలడం తో ఎదురుగా వస్తున్న కారు పైకి దూసుకెళ్ల డంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బండ శ్రీనివాసులు అక్కడికక్కడే మృతి చెందారు. సోమశేఖర్, రాజోలి శ్రీనివా సులు తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అక్కడ కోలుకోలేక మరణించారు. ఈ ప్రమాద ఘటన తెలిసిన వెంటనే కోడుమూరు ఎస్ఐ ఎపి శ్రీనివాసులు, సిఐ తబ్రేజ్ ప్రమాద స్థలానికి వెళ్లి క్షతగాత్రులను కోడుమూరు హాస్పిటల్‌కు తరలించారు. ముగ్గురు కోడుమూరు వాసుల అవడంతో హాస్పిటలు మొత్తం బంధువుల రోదనలతో నిండిపోయింది. కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి హాస్పిటల్‌లో మృతదేహాలను సందర్శించి దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు.



మృతి చెందిన సోమశేఖర్, శ్రీనివాసులు, రాజోలి శ్రీనివాసులు



నుజ్జునుజ్జయిన కారు

నేడు సాహితీ స్రవంతి ప్రాంతీయ కార్యాలయం ప్రారంభం

- చతురిక నవల ఆవిష్కరణ

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

తెలకపల్లి నరసింహయ్య 6వ వర్ధంతి సందర్భంగా ఆయన నివాసాన్ని సాహితీ స్రవంతి ప్రాంతీయ కార్యాలయంగా శని వారం ఉదయం 10:30 గంటలకు ప్రారంభిస్తున్నామని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆవుల బసప్ప ఆవుల చక్రపాణి యాదవ్ లు తెలిపారు. కర్నూలు నగరంలోని కష్టా నగర్‌లో ఈ కార్యాలయం ప్రారంభోత్సవంలో తెలకపల్లి రవి పరిశోధనాత్మక సేకరణ 108 ఏళ్ళ నాటి కర్నూలు నవల...'చతురిక' నవల ఆవిష్కరణ సభ నిర్వహిస్తున్నామన్నారు. కార్యాలయాన్ని గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు చంద్రశేఖర కల్కూర ప్రారంభిస్తారని, నవల ఆవిష్కరణ సభకు సభాధ్యక్షులుగా సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ వ్యవహరిస్తారని అన్నారు. ముఖ్య అతిథిగా ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి సభలో వక్తలుగా లలితకళాసమితి అధ్యక్షులు పత్తిఓబులయ్య, ప్రముఖ నవలా రచయిత ఎస్‌వి.అజీజ్ పాల్గొంటున్నారన్నారు. కార్యక్రమాలన్నింటిని సాహితీస్రవంతి రాష్ట్ర కార్యదర్శి ప్రముఖకవి జంధ్యాల రఘుబాబు సమన్వయం చేస్తారని సాహిత్య అభిమానులు కవులు కళాకారులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



కల్వర్టులు నిర్మించాలి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



12వ వార్డులోని వడ్డగేరి, డబరలలో రోడ్లు డ్రైనేజీలు శుభ్రం చేసి కల్వర్టులు నిర్మించాలని సిపిఎం నగర నాయకులు అబ్దుల్ దేశాయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఎం తరపున 12 వార్డులో పర్యటించారు. ఈ పర్యటనలో సిపిఎం నగర నాయకులు అబ్దుల్ దేశాయ్, వేణు, గోపాల్, ఎండి. మూసా, సిద్దయ్యలు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ సానిటరీ ఇన్‌స్పెక్టర్లు వార్డులో డ్రైనేజీ మురుగు కాలువలు, కల్వర్టులు గురించి మునిసిపల్ అధికారులకు ఏమాత్రం పట్టించుకోవడం లేదని తెలిపారు. సిపిఎం తరపున తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నచో ఇంటి నెంబర్ 17/95 ఎదురుగా 39 బై 295 మున్సిపల్ అధికారులు మెయిన్ రోడ్‌లో తప్ప చిన్నచిన్న వీధుల్లో నెలలు తరబడి డ్రైనేజీలు రోడ్లు, క్లీన్ చేయడం లేదని ప్రజలు తెలిపారు. అక్కడ చిన్న పిల్లలకు పెద్దవాళ్లకు డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ జ్వరాలతో ఇబ్బంది పడుతున్నారు. మున్సిపల్ అధికారులు వచ్చి పన్నులు వసూలు చేసే దానిపై ఉన్న శ్రద్ధ క్లీన్ చేయడంలో లేదన్నారు. 12వ వార్డులో చర్చి వెనుక కల్వర్టు మెయిన్ వాల్ పోయింది. అందులో పెద్దవాళ్లు, బైక్, ఆటో, గాజుల బండి మెయిన్ వాల్ పడడం గాజులన్నీ పగలు పోవడం వల్ల నష్టం జరిగిందని, చాలామంది రాత్రిపూట వాహనాలు నడుపుతున్న వారు పడిపోతున్నారన్నారు. మునిసిపల్ అధికారులు స్పందించి 12 వార్డులో రోడ్లు, డ్రైనేజీలు కల్వర్టులు, మ్యాన్ హోల్ వేసి, మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అక్కడ ఉన్న ప్రజలను సమీకరించి మున్సిపల్ ఆఫీస్ ముందు ధర్నా చేస్తామని హెచ్చరించారు. వార్డులో ఉన్న ప్రజలు శీను, సిద్దయ్య ,మహమ్మద్ పాల్గొన్నారు.

ఓటమెరుగని జ్యోతిబసు

వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కమ్యూనిస్టు ఉద్యమ నేత తుదిశ్వాస వరకు ఓటమి ఎరగని కమ్యూనిస్టు మహాయోధుడు జ్యోతిబసు అని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ అన్నారు. శుక్రవారం కర్నూలు సిపిఎం న్యూ సిటీ నగర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్‌సాయిబాబ అధ్యక్షతన జ్యోతిబసు 15వ వర్ధంతిని కర్నూలు కార్మిక కర్షక భవన్‌లో నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి డి. గౌస్ దేశాయ్, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.నారాయణ, నగర కార్యదర్శివర్గసభ్యులు ఆర్.నరసింహులులు జ్యోతిబాసు చిత్రపటానికి పూలమాలవేసినివాళు లర్పించారు. డి.గౌస్‌దేశాయి మాట్లాడుతూ జ్యోతిబసు ఉన్నత కుటుంబంలో జన్మించి, లండన్‌లో ఉన్నత చదువులు పూర్తి చేసుకుని, మార్క్సిస్టు భావాలకు ఆకర్షితుడై కమ్యూనిజం అజేయమని నమ్మారన్నారు. ఓటమి ఎరుగని నాయకుడిగా కమ్యూనిస్టు ఉద్యమ నేతగా ఎదిగారన్నారు. కార్మిక, కష్టజీవుల నాయకుడిగా అలుపెరుగని పోరాటం చేసిన మహా యోధుడన్నారు. ప్రపంచంలో రష్యా, చైనా కమ్యూనిజాన్ని ఏ విధంగా ప్రపంచం చూసిందో ఆ విధంగా పశ్చిమ బెంగాల్లో భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ అంటే ఇలాఉంటుందని తెలిపారన్నారు. మశ్చిమబెంగాల్లో తిరుగులేని పార్టీని నిర్మించిన మహా నాయకుడన్నారు. ఎమర్జెన్సీ సమయంలో వామపక్ష ప్రభుత్వాన్ని పడగొట్టిన సందర్భంలో తిరిగి బెంగాల్లో ఎన్నికలు జరిగితే కమ్యూనిస్టు పార్టీకి తిరుగులేని విజయం సాధించిపెట్టి ఇందిరాగాంధీకి సైతం ముచ్చెమటలు పట్టించారన్నారు. ప్రత్యర్థుల రాజకీయ ఎత్తుగడలను చిత్తు చేయడంలో మహాజ్ఞాని అన్నారు. ప్రజలే నా బిడ్డలుగా భావించి, తన కుమారుని బడిలో చేర్పించిన సందర్భంలో తండ్రిగా తన పేరు నమోదు చేయకుండా గార్డియన్‌గా పేరు నమోదు చేయించి ప్రజలందరికీ తండ్రిగా నిలిచాడన్నారు. పశ్చిమ బెంగాల్లో 35 సంవత్సరాలు ఎర్రజెండా ఎగరవేస్తూ కమ్యూనిస్టు పరిపాలన ఎలా ఉంటుందో చూపించాడన్నారు. భారతదేశంలో పేదలకు పంచిన భూమి ఎంత ఉందో అంత భూమిని ఒక్క బెంగాల్ రాష్ట్రంలోనే లక్షలాది ఎకరాల భూమిని పంచిన చరిత్ర సృష్టించారన్నారు. 2010 సంవత్సరంలో ఆయన మరణించినప్పుడు నా శరీరం వృధా కాకూడదని భావించి వైద్యులకు పరీక్షలకు ఉపయోగపడే విధంగా తన అవయవాలన్నీ వైద్య పరీక్షల కోసం హాస్పిటల్‌కు రాసి ఇచ్చిన త్యాగశీలి మహా నేత జ్యోతిబసు అన్నారు. ఆయన చూపిన మార్గంలో పయనించి పయనించినప్పుడే ఆయనకు ఘనమైన నివాళి అర్పించిన వారం అవుతామని అన్నారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సి.గురుశేఖర్, ఎం. నగేష్, ఓల్డ్ సిటీ నగర కార్యదర్శి ఎం.రాజశేఖర్ నగరకార్యదర్శివర్గ సభ్యులు కె.సుధాకరప్ప, కె.ప్రభాకర్, నగరనాయకులు ఎస్ఎండి. మహమ్మద్‌రఫీ, ఎం.ఏసు, శ్రీనివాసులు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, ఆటో యూనియన్ నగర అధ్యక్షులు ఎస్.హుస్సేన్‌వలి, షంషీర్, చిన్న మద్దిలేటి, విష్ణుమూర్తి, దేవరాజు, నరసింహ పాల్గొన్నారు.



జ్యోతిబసుచిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న సిపిఎం నాయకులు

గుండ్రేవుల పై ప్రభుత్వం సానుకూలంగా ఉంది

మాజీ రాజ్యసభ సభ్యులు టిజి వెంకటేష్

ప్రజాశక్తి-కర్నూలు అగ్రికల్చర్




రాష్ట్రంలో చాలా సమస్యలకు పరిస్కారం చేయడానికి రాయలసీమ ఐక్యవేదిక కృషి చేసిందన్నారు. అంతే కాకుండా సమైక్యాంధ్ర ఉండాలని కృషి చేశామని మాజీ రాజ్యసభ సభ్యులు టిజి వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో గుండ్రేవుల ప్రాజెక్టుపూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎపి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇద్దరు సుముఖత చూపితే వెంటనే గుండ్రేవుల పూర్తవుతుందన్నారు. జిల్లాలో సరస్వతి, వేదవతి ప్రాజెక్టులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.హంద్రీనీవా పనులు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలని తెలిపారు. రాష్ట్రంలో పరిశ్రమల అభివృద్ధి మరింత ముందుకెళ్తుందని కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మంచి సంబంధాలు కలిగి ఉన్నారన్నారు. పరిశ్రమల మంత్రిగా తన కుమారుడు టిజి.భరత్ ఉన్నారని జిల్లా అభివృద్ధికి తగిన సహకారం అందించేలాకృషి చేస్తారన్నారు. కేంద్ర నిధులు అవసరమైన బిజెపి పెద్దల ద్వారా చేయడానికి తమ వంతు కృషి చేస్తానన్నారు. డోన్‌లో ఒక కులాన్ని తక్కువ చేసి కొట్టడం బాధాకరమని, ఒక కులం పెద్ద ఒక కులం చిన్న అనేది ఉండకూడదన్నారు. అలాంటి పరిస్థితులు వస్తే సమస్య చాలా దూరం వెళ్తుందన్నారు. రెండు రోజుల్లో సమస్యపై తగిన చర్యలు తీసుకోవాలని లేకుంటే అక్కడ తగాదాలు జరిగే అవకాశం ఉందని టిజివి అన్నారు.

ఎన్‌టిఆర్ వర్ధంతి ఘనంగా నిర్వహించాలి

టిడిపి శ్రేణులకు జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

టిడిపి నాయకులు, కార్యకర్తలు ఆయా ప్రాంతాల్లో టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు నందమూరి తారక రామారావు వర్ధంతి వేడుకలను ఈనెల 18న ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షులు పాలకుర్తి తిక్కా రెడ్డి పిలుపునించ్చారు. ఈమేరకు శుక్రవారం ఆయనొక ప్రకటనను విడుదల చేశారు. కర్నూలు జిల్లాలోని అన్ని నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాలలో నిర్వహించాలని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు నియోజకవర్గం ఇన్చార్జీలు, రాష్ట్ర, జిల్లా స్థాయిలో పార్టీలో వివిధ హోదాలలో కొనసాగుతున్న నాయకులకు, కార్యకర్తలకు అభిమానులకు పాల్గొని విజయవతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, హాస్పిటళ్లలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ వంటి సామాజిక కార్యక్రమాలను చేపట్టాలని కోరారు.



ప్రజాశక్తి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న పత్తికొండ ఎమ్మెల్యే కెఇశ్యాం కుమార్

పేదల పక్షపాతి ప్రజాశక్తి

పత్తికొండ ఎమ్మెల్యే కెఇశ్యాం కుమార్

ప్రజాశక్తి-పత్తికొండ


పేద ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాశక్తి పనిచేస్తుందని పత్తికొండ ఎమ్మెల్యే కెఇ. శ్యామ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టిడిపి సీనియర్ నాయకులు సాంబశివరెడ్డితో కలిసి ఆయన ప్రజాశక్తి 2025 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నిజాలను ప్రజాశక్తి పత్రిక నిర్భయంగా రాస్తూ ప్రజల ఆదరణను పొందుతుందన్నారు. కార్మికులు, రైతులు ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కషి చేస్తుందన్నారు. ప్రజాశక్తి పత్రిక దిన దినాభివృద్ధి చెందుతూ నేడు రాష్ట్రంలో ప్రధాన పత్రికలలో ఒకటిగా ఉందన్నారు. ప్రజాశక్తి ఆదోని డివిజన్ చంద్రశేఖర్, టిడిపి నాయకులు కడవల సుధాకర్, తిప్పన్న తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

కుడా చైర్మన్‌కు పిపిఎస్ఎస్ నాయకుల వినతి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

భూకబ్జాదారులు, వారికి సహకరించిన ఆయా శాఖల అధికారులపై చర్యలు తీసుకోవాలని, చెరువులు, వాగులు, ప్రభుత్వ భూముల కబ్జాలపై సర్వే వివరాలు ప్రజలకు తెలపాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, ఎం.వెంకటేశ్వర్లు ఎస్.రమణ గౌడ్ అన్నారు. శుక్రవారం వారి ప్రతినిధి బృందం కుడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. పుల్లారెడ్డి మాట్లాడుతూ జిల్లాలో వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములు, రాజుల కాలం నాటి చెరువులు వాగులు వంకలు కబ్జాలకు గురయ్యాయని ఆరోపణలు వస్తున్నాయన్నారు. ప్రభుత్వం మారీ ఆరు నెలలు గడిచినా సర్వేల పేరుతో సంబంధిత అధికారులు కాలయాపన చేస్తూనే.. ఉన్నారన్నారు. కొన్ని సందర్భాల్లో అధికార పార్టీకి చెందిన నాయకులు భూకబ్జాలపై ఆగ్రహం వ్యక్తం చేసినా అధికారుల్లో తగినంత స్పందన రావడం లేదని తెలిపారు. గార్గేయపురం చెరువు మీదుగా నగరవనం వెళ్లేందుకు గతంలో టిజి. వెంకటేష్ మంత్రిగా ఉన్న సమయంలో వేయించిన సిమెంట్ రోడ్డును కూడా ఆ ప్రాంతంలో ఉన్న బత్తుల బిల్డర్ వదలలేదని, ప్రభుత్వ భూములు, బి.తాండ్రపాడు, గార్గేయపురం చెరువులు, వరద నీరు వెళ్లే వాగులు, వంకలను కబ్జా చేసిన వారితోపాటు వారికి సహకరించిన అధికారులపై కుడా చర్య తీసుకోవాలని కోరారు. వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను, వాగులను చెరువులో కబ్జాల నుండి కాపాడి వాటిని వెంటనే స్వాధీనం చేసుకోవాలని కోరారు. చెరువులు, వాగులు, ప్రభుత్వ భూముల కబ్జాలపై సర్వే వివరాలు ప్రజలకు తెలపాలన్నారు.



సోమిశెట్టికి వినతి ఇస్తున్న పిపిఎస్ఎస్ నేతలు

పార్టీ కార్యక్రమాలుగా మార్చిన కూటమి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్



ప్రభుత్వ కార్యక్రమాలను పార్టీ కార్యక్రమాలుగా కూటమి ప్రభుత్వ నేతలు మారుస్తున్నారని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రాఘవేంద్ర, నగేష్ విమర్శించారు. శుక్రవారం డివైఎఫ్ఐ కార్యాలయంలో వారు మాట్లాడుతూ పారా స్పోర్ట్స్ ఆఫ్ ఆంధ్ర ప్రదేశ్ ఆధ్వర్యంలో ఈనెల 20న జిల్లాస్థాయిలో, 30న రాష్ట్రస్థాయిలో జరుగుతున్న వికలాంగుల క్రీడలను కర్నూలు జిల్లాలోని కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్యారా స్పోర్ట్స్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వికలాంగుల క్రీడల పోస్టర్లను ఆవిష్కరించడాన్ని వారు తీవ్రంగా తప్పు పట్టారు. వికలాంగుల క్రీడలు నిర్వహించడాన్ని అభినందిస్తూనే వారి పట్ల కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు కు వివక్ష ,చులకన ఉండబట్టే కర్నూలులో ఇన్ని స్పోర్ట్స్ క్లబ్బులు ఉన్నప్పటికీ వికలాంగులకు ప్రభుత్వం నిర్వహించే క్రీడల పోస్టర్లను తన పార్టీ కార్యాలయంలో గోడపత్రికలను విడుదల చేశారని అన్నారు. వెంటనే వికలాంగులకు సోమిశెట్టి వెంకటేశ్వర్లు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్వహించే కార్యక్రమాలను పార్టీ కార్యక్రమాలుగా మార్చుతున్నారని, దీనివల్ల రాజకీయాలకతీతంగా మంచి ప్రతిభావంతులైన వికలాంగులు ఇది తెలుగుదేశం కార్యక్రమం అనుకొని దూరంగా ఉండాల్సిన పరిస్థితిని సోమిశెట్టి వెంకటేశ్వర్లు తీసుకువచ్చారని ఆరోపించారు. ప్రభుత్వ సొమ్ముతో నిర్వహించే ఏ కార్యక్రమాన్నైనా ప్రభుత్వ కార్యాలయాల్లోనే నిర్వహించాలని డిమాండ్ చేశారు.



షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ బీవీ

క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లాలి

- ఎమ్మెల్యే బీవీ - షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకొని క్రీడా స్ఫూర్తితో ముందుకెళ్లాలని ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి తెలిపారు. శ్రీనీలకంటేశ్వర స్వామి జాతర సందర్భంగా వివిధ పోటీల్లో భాగంగానే శుక్రవారం షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ఏర్పాటు చేశారు. ఎన్‌టిఆర్ ఇండోర్ స్టేడియంలో షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి షటిల్ ఆడి ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా బ్యాడ్మింటన్ ఆటపై మరింత మందికి మక్కువ పెరుగుతుందన్నారు. 25 ఏళ్ల క్రితం తమ తండ్రి, మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి ఎంతో ముందు చూపుతో ఈ ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. ఇండోర్ స్టేడియాన్ని అభివృద్ధి దిశలో ముందుకు తీసుకెళ్తామని, క్రీడాకారులకు కావాల్సిన సౌకర్యాలు మరింత కల్పిస్తామని పేర్కొన్నారు.

పేదల ఆరోగ్యానికి సిఎం భరోసా

- మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని



చెక్కు పంపిణీ చేస్తున్న మీనాక్షి నాయుడు

పేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా కల్పించే దిశగా రూపకల్పన చేశారని, ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మీనాక్షి నాయుడు తెలిపారు. శుక్రవారం సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్పొరేట్ ఆస్పత్రిలో సైతం పేదలకు ఎన్‌టిఆర్ వైద్య సేవ కింద మెరుగైన వైద్యం అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ నిధులు సకాలంలో ఇవ్వకుండా ఆస్పత్రుల నిర్వాహకులను ఇబ్బందులకు గురి చేసిందని తెలిపారు. అలాంటి పరిస్థితి రాకుండా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లిస్తూ చికిత్సలకు అంతరాయం లేకుండా ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని చెప్పారు. సిఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.1,01,429 చెక్కులను బాధితులకు అందజేశామన్నారు. లక్ష్మికి రూ.62,729, పెద్దతుంబలం శంకరప్పకు రూ.38,700 పంపిణీ చేశామన్నారు. నియోజవర్గంలో ఇంకా 74 మందికి సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు రావాల్సి ఉందని, త్వరలోనే మంజూరయ్యేలా చూస్తామని తెలిపారు.

హామీని నెరవేర్చిన ఎమ్మెల్యే బీవీ

- టిడిపి నాయకులు గురురాజ్ దేశాయ్

ప్రజాశక్తి - నందవరం



రోడ్లను పరిశీలిస్తున్న గురురాజ్ దేశాయ్

పల్లెనిద్రలో ఇచ్చిన హామీని నెరవేర్చి ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి మాట నిలుపుకున్నారని టిడిపి నాయకులు గురురాజ్ దేశాయ్ తెలిపారు. రోడ్లు, డ్రెయినేజీ వసతులు లేక ఇబ్బందులు పడిన ఎస్సీ కాలనీ ప్రజల కష్టాలు తీరాయి. శుక్రవారం వీధిలో సిసి రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాన్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. గురురాజ్ దేశాయ్ కాలనీని సందర్శించి, రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు బీవీ.జయనాగేశ్వర రెడ్డి పల్లెనిద్ర కార్యక్రమాన్ని చేపట్టారని, ఆయన ఈ వీధిలో రాత్రి వేళలో నిద్రించినప్పుడు ఇక్కడున్న దుర్భరస్థితిని గమనించి కాలనీవాసులకు మాట ఇచ్చారని తెలిపారు. టిడిపి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే వీధిలో రోడ్లు, డ్రెయినేజీలు నిర్మిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారని చెప్పారు. ఇచ్చిన మాట ప్రకారం ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆరు నెలల్లోనే రూ.20 లక్షలతో రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణాన్ని చేపట్టారన్నారు. ఈ అభివృద్ధి కార్యక్రమాల పట్ల వీధి ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. వీధి అభివృద్ధికి బాటలు వేసిన ఎమ్మెల్యేకు, గురురాజ్ దేశాయ్‌కి ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీరాజ్ అధికారి నరసింహులు పాల్గొన్నారు.

రోడ్లపైనే అమ్మకాలు..!

• ట్రాఫిక్‌కు అంతరాయం • ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు • విలేజ్ మార్కెట్‌కు మోక్షమెప్పుడు..?

నందవరం గ్రామంలో మార్కెట్ సదుపాయాలు లేక వ్యాపారులు రోడ్లపైనే కూరగాయల అమ్మకాలు చేపడుతున్నారు. రోడ్లపై కూరగాయల అమ్మకాలు చేపడుతుండడంతో రవాణాకు కూడా అంతరాయం కలుగుతోంది. కొన్ని సంవత్సరాలుగా చివర దశలో నిలిచిపోయిన విలేజ్ మార్కెట్‌కు మోక్షం ఎప్పుడు వస్తుందా అని ప్రజలు ఎదురుచూస్తున్నారు.



రోడ్లపై కూరగాయల అమ్మకాలతో ఇబ్బందులు పడుతున్న వాహనదారులు



చివరి దశలో నిలిచిపోయిన విలేజ్ మార్కెట్

ప్రజాశక్తి - నందవరం

వ్యాపారులు, రైతులు పండించిన కూరగాయలను విక్రయించడానికి 2017లో టిడిపి ప్రభుత్వం రూ.9 లక్షలతో విలేజ్ మార్కెట్ నిర్మాణాన్ని చేపట్టింది. అది పూర్తయ్యే సమయానికి వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అప్పటి నుంచి ఇప్పటివరకు ఆ నిర్మాణం అలానే నిలిచిపోయింది. ప్రభుత్వాలు మారుతున్నా యి.. కానీ విలేజ్ మార్కెట్‌కు మోక్షం కలగడం లేదు. మార్కెట్ సదుపాయం లేకపోవడంతో వ్యాపారులు, రైతులు పండించిన కూరగాయల అమ్మకాలను రోడ్లపైనే చేపడుతున్నారు. రోడ్లపైన అమ్మకాలు ఇబ్బందికరంగా మారడంతో కొంతమంది వ్యాపారులు ఇంటి దగ్గర నిర్వహిస్తున్నారు. మరి కొంతమంది వ్యాపారాలను వదులుకొని వలసలు వెళ్లారు.

రోడ్లపై కూరగాయల అమ్మకంతో రవాణాకు ఇబ్బంది

గ్రామంలో ప్రతి శనివారం సాయంత్రం కూరగాయల సంత జరుగుతుంది. ప్రధాన రహదారిపైనే కూరగాయల అమ్మకాలు నిర్వహించడం వల్ల రవాణాకు ఇబ్బందికరంగా తయారైంది. గ్రామస్తులు ఎక్కువ సంఖ్యలో సంతను సందర్శించి కూరగాయలు కొనడానికి వస్తారు. వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. దీని కారణంగా చాలాసార్లు ప్రమాదాలు కూడా జరిగాయి. చాలా సందర్భాల్లో కూరగాయల వ్యాపారులపై వాహనదారులు దూసుకెళ్లారు.

కూరగాయల మార్కెట్ లేక ఇబ్బంది

- వడ్డే గంగమ్మ, నందవరం

గ్రామంలో సుమారు 30 సంవత్సరాలుగా కూరగాయల వ్యాపారం చేస్తూ జీవనాన్ని కొనసాగిస్తున్నాం. కూరగాయలను విక్రయించడానికి మార్కెట్ సదుపాయం లేక ఇబ్బందిగా ఉంది. మార్కెట్ లేకపోవడంతో గ్రామస్తులకు అవసరమైన అన్ని రకాల కూరగాయలను అందించలేకపోతున్నాం. కూరగాయల వ్యాపారాన్ని నమ్ముకునే జీవనాన్ని కొనసాగిస్తున్నాం. మార్కెట్ లేకపోవడంతో వ్యాపారం సజావుగా సాగడం లేదు. విలేజ్ మార్కెట్‌ను పూర్తి చేసి అందులో కూరగాయలను విక్రయించడానికి షాపులను కేటాయించి మమ్మల్ని ప్రభుత్వం ఆదుకోవాలి.

ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు చర్యలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని ప్రధాన రహదారిలో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చర్యలు తీసుకున్నారు. శుక్రవారం సిఐ రామాంజులు, ఎస్ఐ పరమేష్ నాయక్ ఆధ్వర్యంలో స్థానిక రాఘవేంద్ర సర్కిల్ నుంచి ఆర్‌టిసి బస్టాండ్ రహదారిలో ఉన్న వాహనాలను, రోడ్డుకు అడ్డంగా పెట్టిన బోర్డులను, వస్తువులను తీసేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బంది దగ్గరుండి వాహన దారులను, దుకాణ యజమానులను హెచ్చరించి అపరాధ రుసుం విధించారు. రోడ్డుపై అడ్డదిడ్డంగా ఉంచిన ద్విచక్ర వాహనాలకు జరిమానా వేశారు. ఈ విధంగా మరోసారి రోడ్డుపై అడ్డంగా ఉంచరాదని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని సూచించారు. హెడ్ కానిస్టేబుళ్లు రమణ, కానిస్టేబుల్ పరమేష్, సోమశేఖర్, జమీర్, హోం గార్డు వీరేష్ పాల్గొన్నారు.




దుకాణదారులను జరిమానా విధిస్తున్న పోలీసులు

కబ్జాలకు పాల్పడితే ఊరుకోం

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - ఆలూరు

నియోజకవర్గంలో ప్రభుత్వ భూములను కబ్జాలకు పాల్పడితే వాలిపోతామని ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి తెలిపారు. శుక్రవారం ఆలూరు చెరువులో బండరాళ్ల పాతి కబ్జాకు పాల్పడబోయిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విరుపాక్షి మాట్లాడారు. తాగు, సాగునీటికి నోచని ఆలూరు నియోజకవర్గంలోని చెరువులకు నీటిని నింపి సాగుకు, దాహార్తిని తీర్చుకునేందుకు ఉపయోగించాల్సింది పోయి అధికార పార్టీ నాయకులు కబ్జాలకు పాల్పడితే ప్రజలు తిరగబడాలని సూచించారు. పంచాయతీలకు గ్రావెల్ వేసేందుకు ట్రాక్టర్లలో తరలిస్తే ఆలూరు తహశీల్దార్ అనుమతులు తీసుకోవాలని, 'నేను నిప్పు' అని చెప్పినా అతను ఆలూరు చెరువులో గ్రావెల్ తరలిస్తుంటే, చెరువులో రాళ్లు పాతి కబ్జాలకు పాల్పడుతుంటే నిద్రపోతున్నారా అని ప్రశ్నించారు. చెరువులో కబ్జాకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకొని చెరువును కాపాడాలని ఇరిగేషన్ ఈఈ, డీఈ దృష్టికి తీసుకెళ్లగా డీఈ తూతూమంత్రంగా పర్యవేక్షించి వెళ్లారని తెలిపారు. ఆలూరు చెరువు కబ్జాలకు పాల్పడకుండా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ఏర్పాటు చేసి ఆలూరు పట్టణ ప్రజల దాహార్తి తీర్చాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. రామ్‌గోపాల్, భాస్కర్, ఎల్లప్ప, గిరి, వీరేష్, నాగేంద్ర, కొట్టాల రాజు, అరికెర వెంకటేష్ ఉన్నారు.



ఆలూరు చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

20 నుంచి గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు

- ఎడిహెచ్ డాక్టర్ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - గోనెగండ్ల



మాట్లాడుతున్న ఎడిహెచ్

మండలంలోని అన్ని పంచాయతీల్లోనూ ఈనెల 20 నుంచి పశు వైద్య శిబిరాలు నిర్వహించనున్నట్లు గోనెగండ్ల పశు వైద్యాధికారి, ఎడిహెచ్ డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈనెల 20 నుంచి 31 వరకు అన్ని పంచాయతీల్లోనూ పశువైద్య శిబిరాలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ శిబిరాల్లో గొర్రెలకు నట్టల నివారణ మందులు, కోళ్లకు కొక్కెర వ్యాధి, మసూచి వ్యాధికి సంబంధించిన టీకాలు, పశుగర్భకోశ వ్యాధులకు టీకాలు, మందులు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ శిబిరాలను తమ సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి నిర్వహిస్తారన్నారు. రైతులు ఈ పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలి

- ఎంపిడిఒ పుల్లయ్య

ప్రజాశక్తి - నందవరం



మండల ప్రజలు ఆధార్ క్యాంపులను వినియోగించుకోవాలని ఎంపిడిఒ పుల్లయ్య తెలిపారు. శుక్రవారం ఆయన మండల పరిషత్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఆరేళ్లలోపు పిల్లలకు మండలంలోని వివిధ గ్రామాల్లో ఆధార్ క్యాంపలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపు 21 నుంచి 24 వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాటుసారా విక్రయిస్తే చర్యలు : సిఐ

ప్రజాశక్తి - ఆదోని

నాటుసారా కాచినా, విక్రయించినా చట్టారీత్యా నేరమని, ధిక్కరించిన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షిస్తామని వన్ టౌన్ సిఐ శ్రీరామ్ హెచ్చరించారు. శుక్రవారం ఆదోని శివారు కొండల్లో నాటుసారా స్థావరాలపై దాడులు చేసి బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఎల్లమ్మ కొండల్లో నాటు సారా తయారు చేస్తున్న నలుగురు నిందితులను అరెస్టు చేసి 30 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకొని 1000 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం చేశారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి పట్ల ఇప్పటికే నిఘా ఉంచామని, పద్ధతి మార్చుకోకపోతే జైలుకు పంపుతామని సిఐ హెచ్చరించారు.



బెల్లం ఊటను పారబోస్తున్న పోలీసులు



మద్యం చూపుతున్న సిఐ

కర్ణాటక మద్యం విక్రయిస్తే చర్యలు

- ఎక్సైజ్ సిఐ సైదుల్

ప్రజాశక్తి - ఆదోని

నిబంధనలకు విరుద్ధంగా కర్ణాటక మద్యాన్ని విక్రయిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సిఐ సైదుల్ హెచ్చరించారు. శుక్రవారం ఆదోని మండలం ఆరెకల్ గ్రామంలో జిల్లా ఎక్సైజ్ ప్రొహిబేషన్ ఉన్నత అధికారులు సుధీర్ బాబు, రామకృష్ణారెడ్డి ఆదేశాల మేరకు తనిఖీలు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న కర్ణాటక మద్యాన్ని మీడియా సమావేశంలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జాయింట్‌గా ఆరెకల్ గ్రామంలో నరసయ్య అనే వ్యక్తి ఇంట్లో సోదాలు చేశామన్నారు. అక్కడ 30 బాక్సుల్లో కర్ణాటక మద్యం నిల్వ ఉన్నట్లు నిర్ధారణ అయిందని, వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడు నరసయ్యపై కేసు నమోదు చేశామని తెలిపారు. అలాగే పట్టణంలోని బోయగేరి ప్రాంతంలో మద్దిలేటి అనే వ్యక్తి నుంచి 30 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని ఇరువురుపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

8 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ప్రజాశక్తి - సిబెళగల్

మండలంలోని తుంగభద్ర నదిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 8 ట్రాక్టర్లను ఎస్ఐ తిమ్మారెడ్డి పట్టుకున్నారు. శుక్రవారం తనిఖీలు చేపట్టగా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో తెలంగాణకు చెందిన ట్రాక్టర్లు అక్రమంగా ఇసుక తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. ఇక్కడే స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అలాగే అనుమతుల మేరకు, అవసరం మేరకు ఇసుక తరలించుకోవాలని, అమ్ముకొని సొమ్ములు చేసుకోవడానికి కాదని, అక్రమంగా తరలిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

కాజీపురం రామాంజనేయులు మృతి బాధాకరం

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం శివ ప్రసాద్

ప్రజాశక్తి - చిప్పగిరి

చిప్పగిరి మండలం ఖాజీపురం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు కాజీపురం రామాంజనేయులు మృతి బాధాకరమని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వైకుంఠం ప్రసాద్ తెలిపారు. శుక్రవారం రామాంజనేయులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. టిడిపి అభివృద్ధికి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారి కుటుంబానికి పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని చెప్పారు. టిడిపి మండల కన్వీనర్ లాయర్ షేక్షావలీ, నాయకులు కొండా రామాంజనేయులు, ఓబయ్య, సత్తన్న, గోవిందప్ప, నాగరాజు, శివ పాల్గొన్నారు.



రామాంజనేయులు మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న శివప్రసాద్

సమస్యాత్మక గ్రామాలపై నిఘా ఉంచాలి

మండలంలో సమస్యాత్మక గ్రామాలు చాలా ఉన్నాయని, వాటిపై ప్రత్యేక నిఘా ఉంచాలని పోలీసు సిబ్బందికి వైకుంఠం శివప్రసాద్ సూచించారు. చిప్పగిరిలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్రామాల్లో చిన్న సమస్యలను పెద్దవిగా చేసుకుని ప్రాణాల మీదికి తెచ్చుకోవద్దని సూచించారు. ఏ సమస్య ఉన్నా ప్రశాంతంగా.. పెద్దల ద్వారా, పోలీసుల ద్వారా పరిష్కరించుకోవాలని, గొడవలు పడడం మంచిది కాదని తెలిపారు. గొడవలకు పోయి ఇరుపక్కల కుటుంబాలు ఆర్థికంగా ఛిన్నాభిన్నమ వుతాయన్నారు. గతంలో ఎన్నో కుటుంబాలు గొడవలకు పోయి ఎంత నష్టపోయారో అందరికీ తెలుసన్నారు. ప్రతి ఒక్కరూ ప్రశాంతంగా జీవించేటట్లు, సమస్య ఉంటే ఎలా పరిష్కరించుకోవాలని ఆలోచించి పెద్దల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను పార్టీలకతీతంగా అందేలా చూడాలని నాయకులను కోరారు. టిడిపి మండల కన్వీనర్ లాయర్ షేక్షావలీ పాల్గొన్నారు.

అధైర్యపడకండి.. అండగా ఉంటాం...

- పార్టీ కార్యకర్తలే బలం - ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - ఆలూరు

ప్రభుత్వం లేదని అధైర్యపడొద్దని, ఎల్లప్పుడూ అండగా ఉంటామని కార్యకర్తలనుద్దేశించి ఎమ్మెల్యే బి.విరుపాక్షి తెలిపారు. శుక్రవారం ఆలూరులోని ఉమా ఫంక్షన్ హాలులో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. వైసిపి మండల కో కన్వీనర్ వీరేష్ అధ్యక్షత వహించారు. అంతకుముందు ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్ నుంచి డప్పులతో కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే విరుపాక్షి, వైసిపి జిల్లా మహిళా విభాగం అధ్యక్షులు శశికళ ర్యాలీలో పాల్గొని సమావేశానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కూటమి ప్రభుత్వం తప్పుడు వాగ్దానాలతో అధికారం చేపట్టి 8 నెలలు అవుతున్నా సూపర్ సిక్స్ పథకాలను గాలికి వదిలేసిందని విమర్శించారు. రాష్ట్ర ప్రజలు వైసిపి వైపే మొగ్గు చూపుతున్నారని, రాబోయే కాలంలో వైసిపి ప్రభుత్వం వస్తుందని తెలిపారు. కార్యకర్తలు అధైర్యపడకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పార్టీ కోసం కష్టపడిన వారికి పదవులు వస్తాయని చెప్పారు. ఆలూరు మండల కన్వీనర్‌గా సేవలందించిన మొలగవల్లి ఈరన్న వైసిపి జిల్లా కార్యదర్శిగా, మండల నూతన కన్వీనర్‌గా కురవల్లి కురువ మల్లికార్జునను ఎన్నుకున్నందుకు పార్టీ అధినేత వైఎస్.జగన్ మోహన్ రెడ్డికి, ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ కురువ మల్లికార్జున మాట్లాడారు. వైసిపి మండల నాయకులకు, కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. పార్టీ అధిష్టానం, ఎమ్మెల్యే విరుపాక్షి ఆదేశాలను తప్పకుండ పాటిస్తామని చెప్పారు. అనంతరం మండల కార్యకర్తలు ఎమ్మెల్యే విరుపాక్షి, శశికళ, జిల్లా కార్యదర్శి ఈరన్న, మండల కన్వీనర్లను గజమాల వేసి సన్మానించారు. ఎంపిపి రంగమ్మ, వికలాంగుల జిల్లా అధ్యక్షులు మొలగవల్లి రామాంజ నేయులు, జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె.గిరి, నాయకులు శేషప్ప, షఫీవుల్లా, శ్రీరాములు, దేవరాజు, షేక్షావలీ, కొట్టాల లక్ష్మీనారాయణ, జీరా గౌడ్, జంగాలి గజ్జలప్ప, మరకట్టు ఎల్లప్ప, దేవరెడ్డి, సుధాకర్, మల్లికార్జున, కొట్టాల రాజు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే విరుపాక్షిని, నాయకులను సన్మానిస్తున్న కార్యకర్తలు



దుప్పట్లు పంపిణీ చేస్తున్న సభ్యులు

సామాజిక సేవలో పాలు పంచుకోవాలి

- లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ గోపీనాథ్

ప్రజాశక్తి - ఆదోని

ఇతరులకు సహాయం చేస్తూ సామాజిక సేవలో పాలు పంచుకోవాలని లయన్స్ క్లబ్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ గోపీనాథ్ తెలిపారు. శుక్రవారం ఆదోనిలోని కార్వన్ పేట ప్రాంతంలో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వృద్ధులకు 100 దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదరణ లేక ఎంతోమంది అభాగ్యులు ఒంటిపై బట్టలు లేకుండా ఇబ్బందులు పడుతున్నారని, వారి ఇబ్బందులను గమనించి చలికాలంలో ప్రతేడాది ఆదోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దుప్పట్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. సామాజిక సేవ ప్రాముఖ్యతను గుర్తించి లయన్స్ క్లబ్ వారు ఇటువంటి కార్యక్రమాలు చేపడుతున్నారని వివరించారు. క్లబ్ జిల్లా ఛైర్మన్ ప్రసాదరావు, పట్టణ అధ్యక్షులు ధర్మారెడ్డి, కార్యదర్శి శ్రీనాథ్ గుప్తా, విశిష్ట సభ్యులు ఓంప్రకాష్, వనప రాజు ఉన్నారు.

మందుబాబు నిర్లక్ష్యానికి యువకుడు బలి

ప్రజాశక్తి - గోనెగండ్ల



రోధిస్తున్న కుటుంబ సభ్యులు



రమేష్ నాయుడు

మందుబాబు నిర్లక్ష్యానికి యువకుడు బలి అయ్యాడు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందారు. వివరాలిలా ఉన్నాయి... హెచ్.కైరవాడి గ్రామానికి చెందిన ఉప్పరి అశోక్ అతిగా మద్యం సేవించి నిర్లక్ష్యంగా, వేగంగా మోటార్ సైకిల్ నడుపుకుంటూ రోడ్డుపై నడుచుకుంటూ వస్తున్న యువకుని ఈనెల 13న ఢీ కొట్టారు. యువకుని తలకు తీవ్ర గాయాలై గత నాలుగు రోజులుగా కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందారు. గోనెగండ్ల గ్రామానికి చెందిన బోయ రామయ్యకు ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు రమేష్ నాయుడు (33) సొంత ఆటో నిర్వహణతో పాటు కారు డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. ఇతనికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈనెల 13న రాత్రి రమేష్ నాయుడు తమ బంధువుల ఇంటికి భోజనానికి వెళ్లారు. భోజనం చేసి ఇంటికి తిరిగి నడుచుకుంటూ వస్తుండగా తప్ప తాగి మోటారు సైకిల్‌ను నడుపుకుంటూ వస్తున్న ఉప్పరి అశోక్ స్టేట్ బ్యాంకు వద్ద రమేష్‌ను ఢీ కొట్టారు. ప్రమాదంలో రమేష్ తలకు తీవ్ర గాయాలై కుప్పకూలి పడిపోయారు. అపస్మారక స్థితిలో ఉన్న రమేష్‌ను స్థానికులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. నాలుగు రోజులుగా చికిత్స పొందుతూ కోలుకోలేక శుక్రవారం మృతి చెందారు. ఇంటికి ఆధారమైన యువకుడు మృతి చెందడంతో అతని భార్య, తల్లిదండ్రులతో పాటు కుటుంబ సభ్యులు విషాదంలో మునిగిపోయారు. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, భారీ జనసందోహం అశ్రునయనాల మధ్య శుక్రవారం అంత్యక్రియలు ముగిశాయి. మృతుని భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ గంగాధర్ తెలిపారు.

భూకబ్జా ప్రధాన నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - ఆదోని

పట్టణంలో భూ కబ్జాకు పాల్పడిన ప్రధాన నిందితుడు ఆముదాల భాస్కర్‌ను అరెస్టు చేశామని డీఎస్పీ సోమన్న తెలిపారు. శుక్రవారం టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో సిఐ సూర్య మోహన్ రావుతో కలిసి నిందితుని మీడియా సమావేశంలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ సోమన్న మాట్లాడారు. పట్టణ శివారులోని మండగిరి సర్వే నెంబర్ 321/ఎలోని ఆరు ఎకరాల 51 సెంట్ల భూమిని అక్రమ మార్గంలో రిజిస్ట్రేషన్ చేశారని బాధితుడు ఎగ్గటి ఈశ్వరప్ప 4న ఫిర్యాదు చేశారన్నారు. ఫిర్యాదు మేరకు ఇప్పటికే పలువురిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపామని తెలిపారు. అందులో భాగంగానే ప్రధాన నిందితుడు ఆముదాల భాస్కర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపుతున్నామన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ సోమన్న